క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆర్‌కేపురం, లక్ష్మీనగర్, సాత్‌ఎండ్‌పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు. 11కేవీ స్వాతిరెసిడెన్సీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ ఆంధ్రకేసరినగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సూర్యగిరి ఆలయ హుండీ లెక్కింపు



రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో హుండిని లెక్కిస్తున్న సిబ్బంది

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. అమ్మవారి 40వ వార్షిక, కల్యాణోత్సవాలను పురస్కరించుకుని భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆ ఆలయ ఫౌండర్, ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం మాట్లాడుతూ.. హుండీ ద్వారా రూ.1,67,156 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈట శ్రీనివాస్, పాలక మండలి సభ్యులు, పూజరులు, భక్తులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయం వద్ద గ్రామస్తులు, కమిటీ సభ్యులు

మహేశ్వరం: మండలంలోని సిరిగిరిపురం గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, గణపతి పూజతో పాటు తదితర కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేశ్, ఉప సర్పంచ్ లక్ష్మీపాండు, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు ఈదయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీవ్రతాలు



సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న భక్తులు

మీర్‌పేట: మీర్‌పేట శ్రీ కాశీనర్మదేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతం, కుంకుమార్చన కార్యక్రమాలను ఆల య ప్రధాన అర్చకులు పాలకుర్తి సీతారామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధ్యాపకుల నిరసన



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

మహేశ్వరం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకుల బదిలీలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని మహేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం ప్లకార్డులతో కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల నియమాల ప్రకారం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నినిక్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులను బదిలీలు చేపట్టాలన్నారు. మంత్రి సబితారెడ్డిని కలిసి వెంటనే బదిలీలను చేపట్టాలని కోరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు బీఆర్ఎస్ నాయకుడు గుత్తి బాలస్వామిని శుక్రవారం పలువురు పరామర్శించారు. ఇటీవల దాడిలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ జంగయ్య, మాజీ సర్పంచ్ కేశవులు, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు సాయిలు, మల్లేశ్ నాయక్, వెంకటయ్య పరామర్శించారు.

నిర్వహణ కరువై..



ఓపెన్ జిమ్ చుట్టూ ఏర్పాటు చేసిన జాలిని తొలగించిన ఆకతాయిలు



ఓపెన్ జిమ్‌లో కూలిపోయిన పరికరం

- పాడైపోతున్న ఓపెన్ జిమ్ పరికరాలు
- అనుమతి లేని వేళ చొరబడుతున్న ఆకతాయిలు
- ఆట వస్తువులను ధ్వంసం చేసి ఎత్తుకెళ్తున్న వైనం

మీర్‌పేట: ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు... నిర్వహణ మరిచారు. వివరాల్లోకి వెళితే. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు సుందరీకరణలో భాగంగా చెరువు వద్ద ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. స్థానికుల కోసం దీన్ని అందుబాటులోకి తేవడం వరకు బాగానే ఉన్నా.. నిర్వహణను పట్టించుకోకపోవడంతో కొన్ని నెలలకే పరికరాలు పాడైపోయాయి. నిర్వహణతో పాటు పర్యవేక్షణ కూడా లేకపోవడంతో కట్టుచుట్టూ ఏర్పాటు చేసిన కంచెను తొలగించి కొంతమంది ఆకతాయిలు ఓపెన్ జిమ్‌తో పాటు పక్కనే ఉన్న చిల్డ్రన్స్ పార్కులోకి ప్రవేశిస్తున్నారు. ఇందులోని పరికరాలను ధ్వంసం చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో పాటు కొందరు యువకులు చిల్డ్రన్స్ పార్కులోని ప్లాస్టిక్ పరికరాలను దొంగిలించి అమ్ముకుంటున్నట్లు సమాచారం. ఇటీవల ఓ చిన్నారి ఇనుప జాలి నుంచి పార్కులోకి ప్రవేశించే క్రమంలో తల ఇరుక్కోగా స్థానికులు స్పందించి రక్షించారు. పర్యవేక్షణ లేకపోవడం వల్లే ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లోని పరికరాలు పాడైపోయాయి. సంబంధిత కార్పొరేషన్ అధికారులు స్పందించి చెరువు వద్ద వాచ్‌మెన్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

రెండు రోజుల్లో ఓపెన్ జిమ్‌లో పాడైపోయిన పరికరాలకు మరమ్మతులు చేపడతాం. కొందరు వ్యక్తు లు అనుమతి లేని వేళల్లో కంచెను తొలగించి ఓపెన్ జిమ్‌లోకి ప్రవేశిస్తున్నారు. చెరువు వద్ద పర్యవేక్షణ కోసం త్వరలోనే నలుగురు వాచ్‌మెన్‌లను నియమిస్తాం. – గోపీనాథ్, డీఈ, మీర్‌పేట కార్పొరేషన్

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి
- రాచులూరులో క్రికెట్, వాలీబాల్ పోటీలు ప్రారంభం

కందుకూరు: క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి కోరారు. మండల పరిధిలోని రాచులూరులో దివంగత వెదిరె సీతారాంరెడ్డి స్మారక క్రికెట్, వాలీబాల్ పోటీలను శుక్రవారం ఆయన తనయుడు, అర్జున్ అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. విజేతలకు ట్రోఫీలతో నగదు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు డి.నర్సింహాచారి, నిర్వాహకులు రాంరెడ్డి, రమేశ్, రాఘవేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, శేఖర్, వెంకటేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



రాచులూరులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

సీసీ రోడ్డు పనుల పరిశీలన

బడంగ్‌పేట్: కాలనీవాసుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ షిరిడీ సాయినగర్‌లో వేస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. అనంతరం కాలనీల్లో కలియతిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. త్వరలోనే వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జ్యోతి రెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, కాలనీవాసులు ఉన్నారు.



షిరిడి సాయినగర్ కాలనీలో సీసీ రోడ్ల పనులు పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

నిరవధిక సమ్మెకు సిద్ధం

అంగన్‌వాడీ సిబ్బంది

- సీఐటీయూ నాయకులతో కలిసి సమ్మె నోటీసు అందజేత
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

మహేశ్వరం: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె తప్పదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్, సీఐటీయూటీ ఆధ్వర్యంలో శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్‌వాడీలందరికీ గ్రాడ్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పేద, బడుగుబలహీన వర్గాల వారేనని స్పష్టంచేశారు. తమిళనాడు, పాండిచ్చేరీ రాష్ట్రాల్లో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్, అంగన్‌వాడి టీచర్లు స్వరూప, పవిత్ర, శోభారాణి పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు

గురువులు దైవంతో సమానం



బాచుపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

కందుకూరు: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని బాచుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులను శుక్రవారం స్థానిక సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గురువులు దైవంతో సమానమన్నారు. భావితరాల భవిష్యత్తు వీరిచేతిలోనే ఉందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హెచ్ఎం రామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు బాల్‌రెడ్డి, అంజిరెడ్డి, శేఖర్‌గుప్తా, కారోబార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'పెద్దల ఆశీర్వాదం'



వేడుకలో నానమ్మలు, అమ్మలు, తాతయ్యలను సత్కరించిన విద్యార్థులు

మీర్‌పేట: గాయత్రినగర్ రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి నానమ్మలు, తాతయ్యలు, అమ్మమ్మలను పాఠశాలకు ఆహ్వానించి ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు కుముదవల్లి మాట్లాడుతూ.. గ్రాండ్‌పేరెంట్స్ అనుభవాలు, సలహాలు, సూచనలు తీసుకుంటూ, వారి ఆలోచనలను గౌరవిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని సూచించారు. వేడుకలో డీన్ ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారమిస్తే రూ.500కే సిలిండర్



కాంగ్రెస్‌లో చేరిన మహిళలతో మనోహర్‌రెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ అధికారంలోకొస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని నియోజకవర్గ నాయకులు కొత్త మనోహర్‌రెడ్డి అన్నారు. అమీర్‌పేట్ గ్రామానికి చెందిన సుమారు 500 మంది మహిళలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మహిళా సంక్షేమంతో పాటు రైతులందరికీ ఏకకాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ, ఇళ్లు లేని నిరుపేదలందరికీ రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్, పాండు రంగారెడ్డి, దస్రునాయక్, మాజీ సర్పంచ్ చాకలి యాదయ్య, ఆవుల రఘుపతి, రాజేందర్, గోల్కొండ శ్రీనివాస్, ఎర్ర చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ రాములు, మండల నాయకుడు నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ మేడే సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన వేతనాలను పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25 లక్షలు ఇన్సూరెన్స్, దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు జగన్, దర్శన్, సురేశ్, శివరాజు, లింగమయ్య, సుజాత, సంతోష పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది

కడ్తాల్: విద్యార్థులను భావి భారతపౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినర్సింహరెడ్డి అన్నారు. శుక్రవారం కడ్తాల్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత, స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల్లో కల్లా ఎంతో గొప్పదని, ఉపాధ్యాయులను సన్మానించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుగుణ తదితరులు ఉన్నారు.



ప్రధానోపాధ్యాయురాలు విజయను సన్మానిస్తున్న లక్ష్మినర్సింహరెడ్డి

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



పోషక మాసోత్సవంలో అంగన్‌వాడీ టీచర్లు

తలకొండపల్లి: పోషకాలున్న ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్ నస్రీన్‌బేగం అన్నారు. పోషక మాసోత్సావాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధిలోని వెల్జాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం 3లో తల్లులు, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నస్రీన్‌బేగం మాటాడుతూ గర్భిణులు, బాలింతలు, తల్లులు పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా పంపిణీ చేసే బాలామృతం, పాలు, గుడ్లు, విటమిన్‌లతో కూడిన ఆహారపదార్థాలు ఎంతో బలవర్ధకమైనవన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు యశోదమ్మ, రాజమణి, మహిళలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

తుర్కయంజాల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ హెచ్చరించారు. శుక్రవారం పురపాలక సిబ్బంది, స్వచ్ఛ ఆటో కార్మికులతో కలిసి తుర్కయంజాల్‌లోని దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. ప్రతి దుకాణం తిరుగుతూ, చెత్తను బయట వేయొద్దని, అలా వేస్తే రూ.500 నుంచి రూ. 5వేల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

ఆమనగల్లు: నాయీబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయీబ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కానుగుల దశరథం డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 12న నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తమకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని కోరారు. దేవాదాయశాఖలో పనిచేస్తున్న వాయిద్య కళాకారులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గణేశ్, పట్టణాధ్యక్షుడు రమేశ్, నాయకులు పెరికేటి యాదయ్య, నాగేశ్, కోటయ్య, రవి, బాలు, శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దశరథం

ఆదర్శంగా ఆమనగల్లు 'లయన్స్'

లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమం పేరిట పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ డా.దామోదర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నకిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. మారుమూల గ్రామాలకు లయన్స్ సేవలను విస్తరిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీఆర్ఓ పాషా, కోశాధికారి వెంకటయ్య, సభ్యులు కేశవులు, రామ్మోహన్, మల్లేశ్ పాల్గొన్నారు.



అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చెన్నకిషన్‌రెడ్డి